# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులపై అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహిస్తారని అధికార వర్గాలు తెలిపాయి**

2. **రాష్ట్ర వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు ఈరోజు ఘనంగా నిర్వహిస్తున్నారు**

3. **వైకల్యం నిర్ధారించి సదరం సర్టిఫికెట్ల జారీకి ఈ నెల 30వ తేదీ నుంచి మే నెలాఖరు వరకు రాష్ట్రవ్యాప్తంగా 110 ఆసుపత్రుల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు.**

4. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 132వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

===========================

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులపై అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్రాల సన్నద్ధతపై, వాటి ప్రణాళికలపై దీనిలో ప్రధానంగా చర్చిస్తారని పేర్కొన్నాయి. ఎన్నికలు జరిగే రాష్ట్రాల ముఖ్యమంత్రులు మినహా మిగిలిన వారందరూ ఈ సమావేశంలో పాల్గొంటారని వివరించాయి. టీమిండియా స్ఫూర్తితో, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎన్నికలు జరిగే రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి విడిగా సమావేశం కానున్నారని వెల్లడించాయి.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు ఈరోజు ఘనంగా నిర్వహిస్తున్నారు. విజయనగరం జిల్లా రామతీర్థంలో శ్రీ రామ నవమి సందర్భంగా సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను రాములవారికి సమర్పించారు. అనంతరం జరిగిన కళ్యాణ మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. కడప జిల్లాలో ఉన్న ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి గ్రామంలోని అతి పురాతనమైన శ్రీ రామాలయంలో సీతా రామ కళ్యాణం భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా

పానకం వడ పప్పు, అన్నదానం కార్యక్రమాలను భక్తులకు ఏర్పాటు చేశారు దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లు, బారికేడ్లు, చలువ పందిళ్లను అధికారులు ఏర్పాటు చేశారు.

---------------------------

వైకల్యం నిర్ధారించి సదరం సర్టిఫికెట్ల జారీకి ఈ నెల 30వ తేదీ నుంచి మే నెలాఖరు వరకు రాష్ట్రవ్యాప్తంగా 110 ఆసుపత్రుల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యుల అందుబాటు, ఇతర కారణాల దృష్ట్యా ప్రతి సోమవారం లేదా మంగళవారం మాత్రమే ఆసుపత్రుల్లో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. నిర్దేశిత తేదీల్లో, ఎంపిక చేసిన వైద్య శిబిరాల్లో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్షలకు 80 వేల6 వందల 53 మందికి స్లాట్ల బుకింగ్‌కు అవకాశం ఇస్తే.. బుధవారం నుంచి నిన్న సాయంత్రం వరకు 57వేల 4వందల 52 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. ఇందులో 41 వేల మంది తొలిసారిగా దరఖాస్తు చేసుకున్నవారు, మిగిలినవారు గతంలో వైకల్య నిర్ధారణ పరీక్షలకు హాజరై ఫలితాలపై అప్పీల్ చేసుకున్నవారు ఉన్నారని వివరించారు.

---------------------------

మార్కాపురం జిల్లా రాయవరంలో జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ప్రకాశం జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు తెలిపారు. ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన ఈరోజు పరామర్శించారు. ఈ సందర్భంగా క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం మొత్తాన్ని త్వరలోనే అందజేయనున్నట్లు ఓబులేసు తెలియజేస్తూ.

వాయిస్ 34 సెకన్స్

---------------------------

బ్యాంకర్లు క్రియాశీలక పాత్ర పోషిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు సమర్థంగా చేరవేస్తే “వికసిత భారత్ 2047” లక్ష్యం సాధ్యమవుతుందని యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ పైడి రాజా అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 3వ త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (DCC), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (DLRC) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన నిన్న నిర్వహించారు. జిల్లాలో స్థూల జిల్లా దేశీయోత్పత్తి – GDDP లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ పైడి రాజా పేర్కొంటూ..

వాయిస్ 35 సెకన్స్

---------------------------

ప్రపంచ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో ఇంధనం, సరఫరా వ్యవస్థలు, అవసరమైన వస్తువుల లభ్యతపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. దేశంలో లాక్‌డౌన్ విధించే ప్రతిపాదన ఉందన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ప్రజలకు ఇంధనం, శక్తి వనరులు, ఇతర కీలక సరఫరాలు ఎలాంటి అంతరాయం లేకుండా అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు ప్రశాంతంగా, బాధ్యతతో వ్యవహరించాలని హర్దీప్‌సింగ్ పూరి సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలపై దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలలో ఈ రోజు, రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణం కేంద్ర అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్. 18 సెకన్లు

---------------------------

"ప్రపంచమే ఒక నాటక రంగం" స్ఫూర్తితో ఈ రోజు ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా శాంతి స్థాపనకు రంగస్థలం దోహదం చేయాలనే సందేశాన్ని అందిస్తూ 1962 నుంచి అంతర్జాతీయ నాటకరంగ సంస్థ ప్రతి సంవత్సరం మార్చి 27వ తేదీన ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ప్రజలను సామాజిక అంశాల పట్ల చైతన్య పరచడమే కాకుండా ఆయా దేశాల సాంస్కృతిక వారసత్వ చారిత్రక అంశాలను నేటి తరాలకు చేరవేసే వారధులుగా కూడా రంగస్థలం వేదికగా ప్రదర్శింపబడే అనేక ప్రక్రియలు దోహదం చేస్తాయని చాటిచెబుతూ... ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

పేదవిద్యార్థుల బంగారు భవితకు నిలయాలుగా బి.ఆర్ అంబేద్కర్ గురుకులాలు మారాయని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గురుకులాల్లో ప్రవేశ పరీక్షల ఫలితాలను ఆయన నిన్న విడుదల చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అడ్మిషన్లకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడం అంబేద్కర్ గురుకులాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉన్న నమ్మకం, విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు.

---------------------------

---------------------------

---------------------------

---------------------------

---------------------------

---------------------------

====================